వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

పూజలు చేసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 20 : షాద్‌నగర్ మున్సిపాలిటీ జానంపేట వీరాంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఇందులో భాగంగా ఉదయం నుంచే ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ విశ్వం, కౌన్సిలర్ శ్రావణి, నాయకులు బాబర్‌ఖాన్, బస్వం, మురళీమోహన్, వెంకటేశ్‌గౌడ్, కృష్ణారెడ్డి, శేఖర్, సుదర్శన్, జమృత్‌ఖాన్, ఇబ్రహీం, ముబారక్‌అలీఖాన్, సందీప్ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని జానంపేట శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, నాయకులతో కలిసి పూజలు చేశారు. వీరి వెంట నాయకులు నారాయణరెడ్డి, రవియాదవ్, ఆనంద్, శేఖర్, శ్రీకాంత్, శివ ఉన్నారు.

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ధర్నాను విజయవంతం చేయండి

కుర్మిద్దలో కరపత్రం విడుదల చేస్తున్న అంజయ్య, తదితరులు

యాచారం, నవంబర్ 20: దేశంలో బీజేపీ సర్కార్ అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈ నెల 26న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య పిలుపునిచ్చారు. మండలంలోని కుర్మిద్ద గ్రామంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల వల్ల దేశ ప్రజలు, రైతులు, కార్మికులు ఎంతగానో నష్టపోతున్నారన్నారు. నిత్యావసర ధరలతో సామాన్యులు అల్లాడుతున్నట్లు తెలిపారు. ఆదానీ, అంబానీలకు బీజేపీ సర్కారు పెద్దపీట వేస్తూ సామాన్యులను విస్మరిస్తున్నదన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సంవత్సరకాలంలో ప్రజలకు ఒరుగబెట్టిందేమీలేదన్నారు. రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ నెల 26న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సురేశ్, మల్లయ్య, చెన్నయ్య, కుమార్ పాల్గొన్నారు.

పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు, పాల్గొన్న ఆలయ నిర్వాహకులు, భక్తులు

కూరగాయల అలంకరణలో అమ్మవారు

ముగిసిన మైసిగండి మైసమ్మతల్లి జాతర

కడ్తాల్, నవంబర్ 20: మైసిగండి మైసమ్మతల్లి జాతర బుధవారం ముగిసింది. చివరి రోజు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో శత చండీయాగం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఆలయ ట్రస్టీ శిరోలీపంతూనాయక్, ఆలయ ఈవో స్నేహలత, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు జవహర్‌లాల్, కృష్ణ, ఆలయ అర్చక సిబ్బంది యాదగిరి, రాములు, కృష్ణ, చంద్రయ్య, శ్రీనివాస్, హర్షవర్ధన్, వెంకటేశ్, విజయ్, రామకృష్ణ, మహేశ్, కుమారస్వామి పాల్గొన్నారు.

గిరిజనులపై కేసులు ఎత్తివేయాలి

లగచర్లకు బయల్దేరుతున్న మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన గిరిజన నాయకులు

కడ్తాల్, నవంబర్ 20: వికారాబాద్ జిల్లా లగచర్లలోని గిరిజనులను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తున్నదని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం కల్వకుర్తి నియోజకవర్గంలోని కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన గిరిజన నాయకులు, కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో లగచర్లలోని గిరిజనులను పరామర్శించడానికి బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్లలో గిరిజనులపై దాడి జరగడం బాధాకరమని తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో లగచర్లతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయడానికి గిరిజనుల భూములను బలవంతంగా లాక్కోవడం అన్యాయమని పేర్కొన్నారు. అమాయక గిరిజనులపై అక్రమ కేసులు పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనులపై రేవంత్‌రెడ్డి సర్కార్ ఇదే రకమైన ధోరణి కొనసాగితే, రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. తరలిన వారిలో మాడ్గుల మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, మాజీ ఎంపీటీసీ నాగులు, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు తులసీరాంనాయక్, హరిచంద్‌నాయక్, లోకేశ్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండు, మార్కెట్ మాజీ డైరెక్టర్ రమేశ్, నాయకులు రాజూనాయక్, శ్రీనూనాయక్, అంజీనాయక్, మోతీలాల్‌నాయక్, జగన్‌నాయక్, సక్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దవాఖానను తనిఖీ చేస్తున్న డీసీహెచ్‌ఎస్ చంద్రశేఖర్

సమయపాలన పాటించాలి

చేవెళ్లటౌన్, నవంబర్ 20: వైద్యులు సమయపాలన పాటించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్.పి.చంద్రశేఖర్ వైద్యులకు సూచించారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రాన్ని ప్రభుత్వ ఏరియా దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. వైద్యులు దవాఖానలో 24గంటలు అందుబాటులో ఉంటూ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల ప్రభుత్వ ఏరియా దవాఖాన మెడికల్ ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

పాల బిల్లులను వెంటనే చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న పాడి రైతులు

కడ్తాల్, నవంబర్ 20: రెండు నెలలు గడిచినా పాల బిల్లులు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం వెంటనే పాల బిల్లులు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో పాడి రైతులు స్థానిక విలేకరులతో మాట్లాడారు. విజయ డెయిరీలో పాలు పోసే రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో, ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ డెయిరీ యాజమాన్యాలు పాల సేకరణ ధరను అమాంతం తగ్గించాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్ నుంచే అత్యధికంగా పాల ఉత్పత్తి జరుగుతుందని, కానీ ఇక్కడి రైతులకు సమయానికి బిల్లులు అందడంలేదని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాల బిల్లులను విడుదల చేయాలని, లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని పాడి రైతులు హెచ్చరించారు. కార్యక్రమంలో రామకృష్ణ, కృష్ణయ్య, శ్రీను, జంగయ్య, బాలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్ గౌడ్

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

చేవెళ్ల రూరల్, నవంబర్ 20 : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాలతో విద్యార్థులు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, అలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజంలో ఉత్తమంగా మెలగాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, పాఠశాలలో ర్యాగింగ్‌కు పాల్పడొద్దన్నారు. యువత దురలవాట్లకు లోనుకాకుండా పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ సుందరయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మక్తమాదారం గ్రామంలో ఆర్టీసీ బస్సుకు పూజలు నిర్వహిస్తున్న నాయకులు

కడ్తాల్, నవంబర్ 20: గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ అందిస్తున్న బస్సు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ సర్పంచ్ సులోచనసాయిలు, మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి అన్నారు. బుధవారం మక్తమాదారం-ఇబ్రహీంపట్నం వరకు ప్రారంభమైన ఆర్టీసీ బస్సుకు మక్తమాదారం గ్రామంలో నాయకులు, గ్రామస్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మక్తమాదారం నుంచి కడ్తాల్ మీదుగా ఇబ్రహీంపట్నం వరకు బస్సును నడుపాలని కోరగా, అధికారులు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారని తెలిపారు. మక్తమాదారం నుంచి ఉదయం 5:15కు బయల్దేరుతుందని, ప్రతి రోజూ బస్ మూడు ట్రిప్పులు నడుస్తుందని వారు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సింహగౌడ్, నాయకులు జంగయ్య, యాదగిరి, శ్రీనివాస్, మహేందర్, నగేశ్, చెన్నయ్య, యాదయ్య పాల్గొన్నారు.

మహిళలకు అల్లికలపై ఉచిత శిక్షణ

వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య

మహిళలకు అల్లికలపై ఉచిత శిక్షణ ఇస్తున్న ట్రైనర్ సుభాషిణి

షాబాద్, నవంబర్ 20: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య అన్నారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలోని రెండు చోట్ల వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు, అల్లికలపై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలకు కుట్టు, అల్లికలపై ట్రైనర్ సుభాషిణి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మొత్తం 40 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. మహిళలు స్వయం ఉపాధితోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత పాల్గొన్నారు.

కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు నరేశ్

బీసీ రిజర్వేషన్ల శాతం పెంచాలి

తుర్కయాంజాల్, నవంబర్ 20: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ బుధవారం బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వేంకటేశ్వరరావుకు బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు రావులకోలు నరేశ్ ప్రజాపతి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ 55శాతం పైగా ఉన్న బీసీలకు 18 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించినట్లుగా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నరసింహ, చందు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నందిగామ, నవంబర్ 20 : మండల కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ శాఖ, హెచ్‌బీఎల్ పరిశ్రమ ఆధ్వర్యంలో భగీరథ బాలల వికాస కేంద్రం 7వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ సీడీపీవో షబానా, రిటైర్డ్ సీడీపీవో నాగమణి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి హాజరై పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, అంగన్‌వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫౌండేషన్ సేవలను విస్తరిస్తాం

కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి

ఆమనగల్లు, నవంబర్ 20: ఐక్యత ఫౌండేషన్ సేవలను ప్రజలకు మరింత దగ్గరగా చేరుస్తామని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం రెండవ రోజు కొనసాగింది. 360 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 250 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 30 మందిని ఐవోల్ ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 27 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ దవాఖాన ఎంపీహెచ్‌వో తిరుపతిరెడ్డి, కంటి వైద్యులు చంద్రశేఖర్, ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, మల్లయ్య, మల్లేశ్‌నాయక్, రమేశ్‌గౌడ్, కొండల్‌యాదవ్, రమేశ్‌నాయక్, కొండల్‌రెడ్డి, రఘు, యాదయ్య, శేఖర్, శ్రీపతి, రవియాదవ్, అభినవ్, శ్రీను, మహేశ్, మల్లేశ్‌నాయక్, కల్యాణ్, భాస్కర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

పేదల సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 20 : పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ... బుధవారం ధర్మసమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునితకు వినతిపత్రం అందజేశారు. పేద విద్యార్థులకు కేజీ టూ పీజీ ఉచిత విద్యనందించాలని, ప్రజలందరికీ నాణ్యమైన వైద్యసదుపాయం అందించేందుకు ప్రతి గ్రామంలో ఆధునిక ప్రభుత్వ దవాఖాన ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వారివారి అర్హతలను బట్టి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అలాగే, పేదల భూములకు సాగునీటిని అందించటంతో పాటు అర్హులైన వారందరికీ 200గజాల స్థలంలో నాలుగు గదుల ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భవాని, శేఖర్, కన్వీనర్ భాస్కర్, కో -కన్వీనర్ శ్రీకాంత్, రమేశ్, సాయికుమార్, సురేశ్ పాల్గొన్నారు.

మూగజీవానికి నట్టల నివారణ మందులు వేస్తున్న పశువైద్యాధికారులు

మూగజీవాలకు టీకాలు వేయించాలి

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 20 : మూగజీవాలకు సకాలంలో వైద్య చికిత్సలు అందించాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు శ్రవణ్ అన్నారు. మండల పరిధిలోని తులేకలాన్ గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వైద్యశిబిరంలో 25పశువులకు చుడి నిర్ధారణ, గర్భాశయ పరీక్షలు చేశారు. 40 పశువులకు నట్టల నివారణ మందులు వేయడంతో పాటు 18 ఆవులకు సాధారణ చికిత్సలు చేసినట్లు తెలిపారు. పశువు కట్టిన తర్వాత 28రోజులకు చుడి నిర్ధారణ పరీక్ష చేయడం ద్వారా పునరుత్పత్తి సామర్థ్యం పెంచవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ సకాలంలో మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎలిమినేడు పశువైద్యాధికారి ఆనంద్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది సదానందం, గోపాల మిత్రులు జగన్, శంకర్ పాల్గొన్నారు.

గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

కడ్తాల్, నవంబర్ 20: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం ఆగదని, మండలాన్ని సాధించడమే తమ అంతిమ లక్ష్యమని జేఏసీ నాయకులు అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని ఇది వరకే రెండు సార్లు దీక్షలు చేపట్టినా, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ సంయుక్త కార్యదర్శి యాదగిరి, నాయకులు బీమ్లానాయక్, రత్నయ్య, అంజి, పృథ్వీ, శివకోటి, బాలయ్య, రాంరెడ్డి, అయ్యన్న, మహేశ్, జంగయ్య, రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడిని రక్షించిన పోలీసులు

యాచారం, నవంబర్20: గుట్టపై నుంచి దూకి తీవ్రగాయాలపాలైన ఓ క్షతగాత్రుడిని పోలీసులు రక్షించారు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయ్యవారిగూడ గ్రామ శివారులో నెకిందితండా వద్ద బుధవారం జరిగింది. సీఐ నరసింహారావు కథనం ప్రకారం.. మౌలాలి హౌసింగ్‌బోర్డులో నివాసముంటున్న ఏలూరి రామాంజనేయులు కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో మంగళవారం ఓ పూజా కార్యక్రమంలో పాల్గొన్నాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంలో పెట్రోల్ అయిపోగా, బైకు రోడ్డు పక్కన ఉంచి నడక ప్రయాణం కొనసాగించాడు. మండలంలోని అయ్యవారిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఏనెకిందితండా సమీపంలో ఉన్న ఓ గుట్ట ఎక్కి దానిపై నుంచి దూకాడు. దీంతో అతడి కాలుకు తీవ్రగాయాలు కావడంతో పాటు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతడిని చూసిన తండా వాసులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మధు సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఘటనా స్థలాన్ని సందర్శించారు. వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది, స్థానికులు అతడిని రక్షించి చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. అతడి మానసిక స్థితి బాగలేదని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆదిబట్ల, నవంబర్ 20: కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగు రోడ్డు కొహెడ సర్వీస్ రోడ్డు పక్కన బుధవారం జరిగింది. ఆదిబట్ల ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం గొరెంకపల్లి గ్రామం, నకిరేకల్ మండలం, నల్లగొండ జిల్లాకు చెందిన పోల్‌రెడ్డి సుదర్శన్ రెడ్డి(56) బోర్‌వెల్‌పై పని చేసేవాడు. అతడు తన పెద్ద కుమార్తె అయిన ఉమాతో కలిసి నల్లమల్లి అపార్ట్‌మెంట్ టౌన్‌షిప్, మన్నెగూడలో నివాసం ఉంటున్నాడు. బాల్‌రాజ్ బోర్‌వెల్ పని నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి 15 రోజులకోసారి ఇంటికి వచ్చేవాడు. దీంతో వారం రోజుల క్రితంఅదే మాదిరిగా వెళ్లడంతో బోర్‌వెల్ పనికి వెళ్లాడని కూతురు అనుకున్నది. బుధవారం సాయంత్రం ఔటర్ రింగు రోడ్డు సిబ్బంది ఔటర్ రింగు రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఆదిబట్ల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆదిబట్ల సీఐ రాంఘవేందర్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉన్నదని తెలిపారు. మృతుడి ఫ్యాంట్‌ను పరిశీలించగా, అందులో ఒక పేపర్‌పై తన చావుకు కారణం తీవ్రమైన కడుపు నొప్పి వలన చనిపోతున్నానని రాసి తన పెద్ద కుమార్తె ఫోన్ నంబర్ ఉండడంతో పోలీసులు మృతుడి కూతురుకు సమాచారం అందించారు. వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకుని మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించామని తెలిపారు.

విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై పెద్ద అంబర్‌పేటలోని ఓఆర్‌ఆర్ సమీపంలో బుధవారం ఓ లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు పక్కన పడింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

- పెద్దఅంబర్‌పేట, నవంబర్ 20

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఆదిబట్ల, నవంబర్ 20: నేడు మంగల్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని మంగల్‌పల్లి 1 ఫీడర్ మీద 11కేవీ లైన్‌కు తాకే చెట్ల కొమ్మలను తొలగించనుండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆదిబట్ల విద్యుత్ ఏఈ జయన్న తెలిపారు. మంగల్‌పల్లి క్రాస్‌రోడ్డు, రిషోబ్ ఇండస్ట్రీస్, శ్రీచైతన్య ఇంజినీరింగ్ కాలేజీ, శ్రీ ఇందూకాలేజీ, హెచ్‌పీ పెట్రోల్ పంపు, పవన్ రైస్‌మిల్, జాగృతి కాలేజీ, శాంతారైస్‌మిల్, అగ్రికల్చర్ కాలేజీ, పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని వారు కోరారు.